

ఏజెన్సీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలో విద్యార్థులను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి, ఇప్పలపాడు ఏకలవ్య, దొరమామిడి, కామయ్యకుంట గురుకుల గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువు ద్వారా మంచి భవిష్యత్తు పొందాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యావ్యవస్థకు అవసరమైన వసతుల గురించి తన దృష్టికి తీసుకొస్తే సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గిరిజన సంఘ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

కౌలు రైతులకు..
'అన్నదాత సుఖీభవ' ఎప్పుడు..!



- కూటమి వచ్చాక నాలుగోసారి వరి సాగు
- ఇప్పటికే రెండు ఖరీఫ్, ఒక రబీ సీజన్ పూర్తి
- రెండేళ్లు గడుస్తున్నా పెట్టుబడి సాయం నిల్
- 80 శాతం సాగు కౌలురైతుల చేతుల్లోనే
- దెబ్బతిన్న పంటలకు పరిహారమూ దక్కని దుస్థితి
- రెండు జిల్లాల్లో లక్షా 80 వేల మంది కౌలురైతుల పరిస్థితి దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం కౌలురైతులను వంచించిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పంట పండించే కౌలురైతులను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం సొమ్ము కౌలురైతులకు చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి ఉంది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద కౌలురైతులకు సైతం రూ.20 వేలు అందిస్తామంటూ కూటమి ప్రభుత్వం తెలిపింది. అధికారంలోకొచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకూ కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ రెండు ఖరీఫ్, ఒక రబీ సీజన్లు పూర్తయ్యాయి. నాలుగోసారి రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం రబీసాగుకు నారుమడులు సైతం ముమ్మరంగా వేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం అధికారులు తీసుకున్న లక్ష్యం ప్రకారం ఏలూరు జిల్లాలో 75 వేల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా ఐదువేల మంది మొత్తం లక్షా 80 వేల మంది కౌలురైతులు ఉన్నారు. వీరిలో ఏలూరు జిల్లాలో 62 వేల మందికి, పశ్చిమలో 80 వేల మందికి కౌలుకార్డులు జారీ చేశారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. గడిచిన ఖరీఫ్ ఆరంభం నుంచి పెట్టుబడి సాయం సొమ్ము జమ చేయడం ప్రారంభించింది. ఇప్పటికి రెండు విడతల సొమ్ము జమ చేసింది. పెట్టుబడి సాయం కింద ఏలూరు జిల్లాలో 1,60,968 మంది, పశ్చిమలో 1,03,761 మంది లబ్ధిదారులు ఉన్నారు. దాదాపు రూ.174 కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు. మరో విడత సొమ్ము జనవరిలో వేయాల్సి ఉంది. భూయజమానులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేసిన ప్రభుత్వం కౌలురైతులను మాత్రం పూర్తిగా పక్కన పెట్టింది. అక్టోబర్‌లో కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ నెల పూర్తవుతూ, రబీ సాగు ఆరంభమైనా పెట్టుబడి సాయం సొమ్ము మాత్రం ఇవ్వలేదు. దీంతో తాము చేసిన నేరం ఏమిటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెపాల్సి ఉంది.

పంట నష్ట పరిహారమూ లేదు.. పంట రుణాలు అంతంతమాత్రమే

మొంథా తుపానుకు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 12,500 ఎకరాల వరకూ పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంటనష్టం నమోదు జరిగింది. దీంతో సాగుచేసిన కౌలురైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లను పంటనష్టం జాబితాలో చేర్చారు. దీంతో పంటనష్టం సొమ్ము సైతం కౌలురైతులకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పంటల బీమా సొమ్ము సైతం భూయజమానులకే అందనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 62 వేల మంది రైతులకు కౌలుకార్డులు జారీ చేసి కేవలం రూ.50 కోట్లు పంటరుణాలుగా ఇవ్వగా, పశ్చిమలో 80 వేల మందికి కౌలుకార్డులు అందించి రూ.వంద కోట్లు వరకూ మాత్రమే పంట రుణాలు అందించారు. వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు ఇచ్చిన రుణాలు ఒక్కశాతం కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టాన్ని సవరిస్తామని, కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హడావుడి సైతం చేశారు. తర్వాత మౌనం వహించారు. సాగు చేసే వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయ సాగులో కౌలురైతులదే కీలకపాత్ర. అటువంటి కౌలురైతుల తరపున ప్రజాప్రతినిధులు ఏఒక్కరూ కనీసం నోరువిప్పని పరిస్థితి ఉంది. అధికారులు సైతం కౌలురైతుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. సమావేశాల్లో కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ప్రకటనలు చేయడం తప్ప.. పర్యవేక్షణ అనేది లేకుండాపోయింది. ఇప్పటికైనా కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము అందించాలని అంతా కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్.రవికుమార్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ సీనియర్ టీచర్లకు, 2010కు ముందు నియమితులైన టీచర్లకు టెట్ రద్దు చేయాలని, ఆ మేరకు విద్యాహక్కు చట్టం సవరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలనీ డిమాండ్ చేశారు. ఎస్ఎస్‌సి వంద రోజుల ప్రోగ్రాంలో విద్యార్థుల శారీరక, మానసిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆదివారాలు, సెలవు రోజుల్లో క్లాసులు రద్దు చేయాలని, ఎఫ్ఎల్ఎన్ 75 రోజుల ప్రోగ్రాం అమల్లో కూడా విద్యార్థులకు స్వేచ్ఛగా వారికి రాని అంశాలు నేర్పించే అవకాశం కల్పించాలని, సింగిల్ టీచర్ల సెలవుల విషయంలో, ఒహెచ్‌లు ఉపయోగించుకునే విషయంలో పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. గురుకుల సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుల పట్ల ఆ శాఖ పైస్థాయి అధికారుల నుండి కిందిస్థాయి అధికారుల వరకు వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని, ఉపాధ్యాయులను ఇబ్బందులు పెడుతూ అన్ని విషయాలకు వారినే బాధ్యులు చేయడాన్ని నివారించాలని కోరారు. జిల్లాలో కొన్ని మండలాల్లో ఎంఇఒలు టీచర్ల పట్ల ప్రత్యేకించి మహిళా ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరి చేసుకోవాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు, విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బొర్రా సుభాషిణి, గౌరవాధ్యక్షులు శ్యాంబాబు, సహాధ్యక్షులు ఎస్.సుధారాణి, కోశాధికారి జివి.రంగమోహన్, రాష్ట్ర కౌన్సిలర్ షేక్ ముస్తఫాఅలీ తదితరులతోపాటు వివిధ మండలాల నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం భేష్

ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా అధికారులకు సిఎం ప్రశంసలు

ప్రజాశక్తి - ఏలూరు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి

ఒక్కరోజులోనే 22ఎ భూసమస్యలకు సంబంధించి 1147 దరఖాస్తులను పరిష్కరించి, 142.04 ఎకరాల భూమిని 22ఎ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించడంపై సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. దీనికి కృషి చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, అందుకు కృషి చేసిన జిల్లా యంత్రాగాన్ని ఆయన అభినందించారు. అమరావతిలో రెండో రోజు గురువారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో 22ఎ భూముల సమస్య పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం, వచ్చిన ఫలితాలను కలెక్టర్ వివరించారు. దీనిపై సిఎం స్పందిస్తూ ఏలూరు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలలో 22ఎ భూసమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ మద్యం, నాటుసారా, గంజాయిలపై ఉక్కుపాదం మోపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ఏలూరు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను సిఎం అభినందించారు.

చేపలు, రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.బలరాం

ఆక్వా ప్రాంతంలో కాల్వలను ఆధునికీకరించాలి

చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నంబూరి వెంకటరామరాజు

కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్‌ను రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఆక్వా రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

ఆక్వా రైతుల జిల్లా సదస్సు తీర్మానం



అభివాదం చేస్తున్న నేతలు, రైతులు


ప్రజాశక్తి - కలిదిండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని, చేపలు, రొయ్యల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.బలరాం, చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) డిమాండ్ చేశారు. గురువారం కలిదిండిలోని కళ్యాణి ఫంక్షన్ హాలులో ట్రంప్ సుంకాలు-సంక్షోభంలో ఆక్వా రంగం-పరిష్కార మార్గాలు అనే అంశంపై ఆక్వా రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్.మహంకాళిరావు అధ్యక్షత వహించారు. ఆక్వా రైతాంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథులు బి.బలరాం, తాడినాడ బాబు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల వల్ల ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాల నుండి ఆక్వా రంగాన్ని కాపాడాలని కోరారు. ప్రస్తుతం ఆక్వా ఉత్పత్తులకు స్థిరమైన, నిలకడైన ధరలు లేకపోవడం వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరిగి ఆక్వా రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఆక్వా ఫీడ్‌కు సంబంధించిన సోయాబీన్ వంటి ముడి సరుకుల ధరలు తగ్గినా ఫీడ్ ధరలు తగ్గించకపోవడం అన్యాయమన్నారు. సీడ్, ఫీడ్ నాణ్యత ఉండటం లేదని చెప్పారు. ఫీడ్ ధరలు తగ్గించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ సబ్సిడీ రైతులందరికీ వర్తింపజేయాలని, పెంచిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తగ్గించాలని అన్నారు. ఆక్వారంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆక్వా ప్రాంతంలోని కాల్వలు బాగు చేసే బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. కాలువలు ఆధునికీకరించాలని కోరారు. పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు కుదింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ రద్దు చేయాలన్నారు. ఆక్వా ప్రాంతంలో రోడ్లు వంటి మౌలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. అందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. సదస్సులో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా టెక్ పత్రిక ఎడిటర్ జోసెఫ్, ఆదర్శ చేపల రైతు కోకా శ్రీనివాసరావు, సుస్థిర వ్యవసాయ ప్రతినిధి షేక్ ఆలీ హుస్సేన్, ఆక్వా రైతులు ఘంటా సుబ్రమణ్యం, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు వీరవల్లి భాస్కరరావు, సిపిఎం నాయకులు చిన్నం మాధవ, పతివాడ కనకదుర్గ, జమ్ము దర్గ, చిన్నం శ్రీకాంత్, ఎస్ఎస్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి అభినందనీయం

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు



క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఎల్ఎ, సర్పంచి, ప్రముఖులు

ప్రజా సమస్యలను గుర్తించడం, వార్తల రూపంలో వాటిని అధికారుల దృష్టికి తేవడం, వాటి పరిష్కారానికి తగు సూచనలు చేయడం వంటి కార్యక్రమాలను ప్రజాశక్తి దినపత్రిక చేపట్టడం అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పొలసానిపల్లిలో గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హుసేన ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇటీవల కాలంలో కొల్లేరు ప్రాంతంలో ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తేవడం, సమస్యల పరిష్కారానికి వారు చేస్తున్న పోరాటానికి ప్రజాశక్తి అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మండలస్థాయి అధికారులతోపాటు కూటమి నాయకులు కరణం పెద్దిరాజు, యుగంధర్, పత్తి మదన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు కోరుతూ నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



నినదిస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను తక్షణం రద్దు చేయాలని, ఏలూరు పెట్రోల్ బంక్‌లో జరిగిన రూ.82 లక్షల అవినీతిపై సమగ్ర విచారణ జరిపి సంబంధీకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యాన స్థానిక కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వకుండా అవినీతి జరగగానే లక్షలాది రూపాయలు కార్మికుల వద్ద నుంచి వసూలు చేయడం సమంజసం కాదన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై శిక్షలు ఉండాలని, అయితే అవినీతికి సంబంధం లేని వారిని సస్పెండ్ చేయడం సబబు కాదని అన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి యాజమాన్యం సమగ్ర న్యాయ విచారణ జరిపించి దోషులను గుర్తించాలని, సుందరయ్యను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ అసలు దోషులను వదిలి అవినీతితో సంబంధం లేని వారిని సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ఏలూరు డిపోలో అవినీతి జరిగితే ఏలూరు డిపోకు సంబంధం లేని సుందరయ్యను సస్పెండ్ చేయడం కక్ష సాధింపు చర్య అని, తక్షణమే సుందరయ్యను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి మాట్లాడుతూ అసలు దోషులను తప్పించి సంబంధం లేని వారిని ఇరికించి చేసిన ఈ సస్పెన్షన్లు ప్రమాణాలకు, రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధమైనవని, నిజాయితీగా పని చేసే ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడిని అవినీతి కేసులో సస్పెండ్ చేయడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సుభాషిణి, సిఐటియు నగర కార్యదర్శి ఇస్సాక్, ఐద్వా నగర కన్వీనర్ ఎం.అరుణకుమారి మద్దతుగా ప్రసంగించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టికె.రావు, ఎన్.సురేష్, ఏలూరు డిపో కార్యదర్శి ఎ.రమేష్, ఆర్‌టిసి శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ బి.సూర్యకళ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులివ్వాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాలకు నిధులు, అదనపు తరగతుల మంజూరుకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనేంద్రరావు కోరారు. ఈ మేరకు ఆయన ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మనేంద్ర మాట్లాడుతూ బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 2009లో స్థాపించామని, నాటి నుంచి నేటి వరకు శాశ్వత భవనాలు కళాశాలకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. 2018లో భవనాల నిర్మాణానికి రూ.కోటి మంజూరైనప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల కళాశాల నిర్మాణం నిలిచిపోయిందన్నారు. గతంలో కళాశాల నిర్మాణానికి కేవలం ఆరు గదులకే నిధులు మంజూరయ్యాయని, అవి కళాశాల తరగతులు నిర్వహించడానికి సరిపోవని అన్నారు. ప్రస్తుతం కళాశాలలో నాలుగు కోర్సులు నడుస్తున్నాయని, వాటికి సుమారు 20 నుంచి 26 తరగతి గదులు అవసరమని తెలిపారు. డిగ్రీ కళాశాల పోలవరం నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలని, ఈ కళాశాల గిరిజన విద్యార్థులకు అత్యంత అవసరమని అన్నారు. ప్రస్తుతం కళాశాల ఎస్‌టి బాలికల హాస్టల్‌లో తాత్కాలికంగా తరగతులు నిర్వహించామని తెలిపారు. కళాశాల శాశ్వత భవనాలకు నిధుల మంజూరు, అదనపు తరగతుల మంజూరుకు ప్రయత్నం చేయాల్సిందిగా ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌ను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బొజ్జయ్య దొర మాట్లాడుతూ కళాశాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎస్.అక్కులన్న, మర్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, శ్రామిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిఐటియు 18వ అఖిలభారత మహాసభ పోరాటాలకు రూపకల్పన చేస్తుందని సిఐటియు నాయకులు పంపన రవికుమార్, ఎం.ఇసాక్, ఎర్ర రాంబాబు, కట్టా సత్యనారాయణ అన్నారు. సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలో గురువారం వివిధ ప్రాంతాల్లో సిఐటియు పతాకాలు ఆవిష్కరించారు. పవర్‌పేట మేదర్ల కాలనీలో కట్టా సత్యనారాయణ, చాటపర్రు రోడ్డు రైస్ మిల్లుల వద్ద గేదెల శివకుమార్, శనివారపుపేటలో ఎర్ర రాంబాబు సిఐటియు పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, మెడికల్ రిప్రజెంటివ్స్ యూనియన్ నాయకులు వివిఎన్.ప్రసాద్, కడలి రామాంజనేయులు, జి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని సీతానగరం గోద్రెజ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు సిఐటియు జెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకురాలు సిహెచ్.శాంతిశ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ ఆగ్రోవేట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నత్త వెంకటేశ్వరరావు, భూక్య నాగరాజు, గణేష్, రాంబాబు, మెహబూబ్, రవీంద్ర, తదితర నాయకులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నలుగురు అరెస్టు

రూ.పది లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పలు దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురిని జంగారెడ్డిగూడెం సర్కిల్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.పది లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎఎస్‌పి సుస్మిత రామనాథన్ వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన సురం జయరాజు ఈ నెల 14వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం ఏలూరు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వీరిశెట్టిగూడెం బయలుదేరాడు. ఈ క్రమంలో తడికలపూడి గ్రామ శివారులో అంకాలమ్మ ఆలయ సమీపంలోకి వచ్చేసరికి నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వెనక నుంచి వచ్చి అతడిని అడ్డగించారు. చాకు చూపించి చంపుతామని బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ.20 వేల నగదును దోచుకుని మోటార్‌సైకిల్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు ఈ నెల 16వ తేదీన తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి సుస్మిత రామనాథన్, సిఐ ఎంవి.సుభాష్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 17వ తేదీన తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు తన సిబ్బందితో కలిసి జంగారెడ్డిగూడెం మండలం అశ్వారావుపేట రోడ్డు చెక్‌పోస్ట్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు జువ్వ సురేష్, నేకూరి ప్రదీప్‌కుమార్, పోలుపాము కళ్యాణ్, మంగళగిరి శ్రీనులుగా గుర్తించారు. వీరిలో ముగ్గురు కొయ్యలగూడెం మండలానికి, ఒకరు కడియం మండలానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ట్రాక్టర్, పలు ద్విచక్ర వాహనాలు, రూ.16 వేల నగదు, మొత్తం సుమారు రూ.పది లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి తెలిపారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు, ఆయన సిబ్బందిని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ అభినందించారు.

కొల్లేరు హద్దుల నిర్ధారణ పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న జెసి

కొల్లేరు అభయారణ్య భూముల హద్దులు నిర్ధారణలో పురోగతిపై మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ అన్నారు. కొల్లేరులో 44 గ్రామాల హద్దులు నిర్ధారణ పూర్తయ్యిందని, మిగిలిన 11 గ్రామాల్లో 20 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో గురువారం కొల్లేరు అభయారణ్య భూముల హద్దులు నిర్ధారణ (ఉమ్మడి తనిఖీ)లో పురోగతిపై అటవీ, రెవెన్యూ, నీటిపారుదల, సర్వే విభాగాలు సంబంధిత శాఖల అధికారులతో జెసి సమీక్షించారు. మొత్తం కొల్లేరు గ్రామాలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెసి మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్య పరిధి ఏలూరు జిల్లాలో 8 మండలాలు, పశ్చిమగోదావరి జిల్లా ఒక మండలం మొత్తం తొమ్మిది మండలాల్లో మొత్తం 55 గ్రామాల్లో 77 వేల ఎకరాల భూమి ఉందన్నారు. హద్దుల నిర్ధారణలో సంబంధిత శాఖలు మంచి ఫలితాలు సాధించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు పాత మ్యాప్ ప్రకారం అభయారణ్య పరిధి సరిహద్దులు నిర్ధారణ గుర్తిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, నీటిపారుదలశాఖ ఎస్ఇ దేవప్రకాష్, డిఎఫ్ఒ విజయ, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖాధికారులు, డివిజన్, మండల సర్వేయర్లు, అటవీ శాఖ సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎసిబి డిఎస్‌పిగా కృష్ణారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అవినీతి నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఏలూరు ఎసిబి డిఎస్‌పి కృష్ణారావు సూచించారు. ఎసిబి డిఎస్‌పిగా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1991 బ్యాచ్ ఎస్‌ఐగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేశారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, పెరవలి పోలీస్ స్టేషన్లో పనిచేశారు. తరువాత సిఐగా ఉద్యోగోన్నతి పొంది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు, ఏలూరు ఇంటెలిజెన్స్ ఆఫీసులో, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరోలో పని చేశారు. 2020లో డిఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొంది ఏలూరు ఇంటెలిజెన్స్ ఆఫీసులో డిఎస్‌పిగా పనిచేసి తరువాత పాలకొండ ఎస్‌డిపిఒగా, ఎపిఎస్‌పి బెటాలియన్‌లో డిఎస్‌పిగా విధులు నిర్వహించారు.

సకాలంలో వైద్యం అందితేనే ప్రాణ రక్షణ

డాక్టర్ వేణు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైద్యో నారాయణ హరి అన్న మాటకు అర్థం, ఆపద వచ్చినప్పుడు భగవంతుడిని ప్రార్థించడం కాకుండా శరీరానికి ఇబ్బంది కలిగిన వెంటనే వైద్యున్ని ఆశ్రయించడమూ అంతే ముఖ్యమని వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు వేణు అన్నారు. సకాలంలో సరైన వైద్యం అందితేనే ప్రాణాలను కాపాడుకోవడం, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన 13 ఏళ్ల నాగ సూరిబాబు అనే బాలుడికి అరుదైన గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ వేణు తెలిపారు. బాలుడి గుండెలో ఏర్పడిన చిన్నపాటి రంధ్రాన్ని గుర్తించి, శస్త్రచికిత్స ద్వారా ప్రత్యేక డివైస్ అమర్చి ఆ రంధ్రాన్ని మూసివేసినట్లు వివరించారు. ఇలాంటి గుండె లోపాలు ఉన్న పిల్లలకు ఆయాసం, శరీరక బలహీనతతో పాటు ఎదుగుదలలో లోపాలు ఏర్పడే ప్రమాదం ఉంటుందని, వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. సాధారణంగా ఇలాంటి సమస్యలకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి వస్తుందని, అయితే ఆధునిక వైద్య సాంకేతికతతో శాస్త్ర ద్వారా నేరుగా గుండెలోని గదుల మధ్య ఉన్న రంధ్రాన్ని మూసివేసే డివైస్ క్లోజర్ పద్ధతిని అనుసరించి, ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే చికిత్స అందించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ వేణును బాలుడి కుటుంబ సభ్యులు అభినందించారు. పెద్ద నగరాలకు వెళ్లే పరిస్థితి లేక, అప్పుల పాలయ్యే కుటుంబాలకు ఉపశమనం కలిగేలా అప్లాండ్, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఆధునిక పరికరాలతో తక్కువ ఖర్చులో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ వేణు తెలిపారు. ఈ సందర్భంగా వేణు కార్డియాక్ కేర్ ఆసుపత్రి మేనేజర్ పాతూరి రాజశేఖర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న గుండె వైద్య సేవలను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ వేణు

ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కలెక్టర్ కార్యాలయ డిఆర్‌ఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అంకన్నగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సస్పెండ్ అయిన ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్ల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం డిఆర్‌ఒ, విశ్వేశ్వరరావుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్య దర్శి అల్లాడి రాజు మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులు వారి కులాచారం మేరకు బాలిక అక్క భర్తకు ఇచ్చి వివాహం చేశారని, ఆ విషయం తల్లి దండ్రులు, బాలిక గోప్యంగా ఉంచారని, సెలవుల అనంతరం బాలిక హాస్టల్‌కు వచ్చిందని తెలిపారు. బాలిక శరీరంలో వచ్చే మార్పు లను పాఠ శాల సిబ్బంది గమనించి బాలిక తల్లిదండ్రులకు చెప్పగా వారు బాలిక బావను పంపించారని చెప్పారు. బాలిక బావను విషయం చెప్పి బాలికను వారి ఇంటికి పంపించారని, దీనిలో హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్ తప్పిదం లేదని అన్నారు. వారి సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కోరారు.

మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అప్సా జంగారెడ్డిగూడెం, పోలవరం జోన్ యాజమాన్యాల తరపున ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి ఎపిపియుఎస్‌ఎంఎ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ కుండేటి రామకృష్ణ మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు నారా లోకేష్ పాదయాత్రలో ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలు నారా లోకేష్‌ను కలిసి వారు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆరోజు ఆయన ఇచ్చిన హామీ మేరకు ప్రైవేటు పాఠశాలలకు చక్కటి ఊరటనిస్తూ రెండు అంశాలలో జిఒ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాల అసోసియేషన్ తరపున కూటమి ప్రభుత్వానికి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాల ట్రెజరర్ కళ్యాణ్ పుష్పీశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రేమతత్వమే క్రీస్తు మార్గమని ప్రతి ఒక్కరూ తోటి వారితో ప్రేమానురాగాలతో జీవనం సాగించాలని సిబిసిఎన్‌సి కృష్ణా-గోదావరి అధ్యక్షుడు విజ్ఞాన్ గురువు సీనియర్ రెవ.పాకలపాటి ప్రభాకరరావు అన్నారు. మండల పరిధిలోని కనసనపల్లి సిబిసిఎన్‌సి చర్చి ప్రాంగణంలో రెవ డీకన్‌కొల్లూరి ఐజక్ జాన్ ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ పివిఎన్.ప్రసాద్, ఎస్ఐ కె.శుభశేఖర్, ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్, కొవ్వొత్తుల ప్రదర్శన,చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్టర్లు రెవ జె.ఆనందరావు, బి.భగవాన్‌దాస్, ఆమోస్, కె.విజయ డేవిడ్, సంఘసభ్యులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, ప్రముఖులు

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డిఎంహెచ్ అమృతం ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి జంగారెడ్డిగూడెం

మండలంలోని నిమ్మలగూడెంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆ గ్రామంలో విషాదాన్ని నింపింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన యువకుడు జంగం రాజేష్ (22) ఈ నెల 17వ తేదీ బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజేష్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు రాజేష్ గ్రామంలో కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య ఐశ్వర్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శరణ్యకు రెండేళ్లు, చిన్నకుమార్తె హిరణ్యకు ఏడాది అని బంధువులు తెలిపారు. మృతుడు రాజేష్ తల్లి గల్ఫ్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలి

22న ఏజెన్సీ బంద్

పోలవరం జిల్లా సాధన కమిటీ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండల కేంద్రంలోని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్ష, కార్యదర్శులు పొట్ల మోహన్, ఊకె ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకటించిన పోలవరం జిల్లా ఏలూరు ఏజెన్సీ ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. పోలవరం నిర్వాసిత ప్రాంతాన్ని ఒక జిల్లాగా ప్రకటిస్తామని సిఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఉల్లంఘించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలుపుతూ పునరాలోచన చేసి పోలవరం ఏజెన్సీ ప్రాంతాన్ని కలుపుకుని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పోలవరం జిల్లాలోని పోలవరం ఏజెన్సీ ప్రాంతాన్ని చేర్చేలా చర్యలు తీసుకునేందుకు డిసెంబర్ 22న పోలవరం ఏజెన్సీ ప్రాంత బంద్ నిర్వహించాలని జిల్లా సాధన కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ బంద్‌కు మండలంలోని ప్రజలందరూ సహకరించాలని, ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్స్, హోటల్స్, స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలని కోరుతూ ఈ నెల 22న చేపట్టే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పోలవరం జిల్లా సాధన కమిటీ నాయకులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పూచికపాడులో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం పేరుతో ఏర్పడే రంపచోడవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం చేర్చకపోవడం బాధాకరమన్నారు. రంపచోడవరంలోని పలు మండలాలతో పాటు పోలవరం నియోజకవర్గం కలిపి ప్రత్యేక జిల్లాగ చేయాలని, తదితర సమస్యలపై ఈనెల 22న చేపట్టే మన్యం బంద్‌లో ప్రజా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, తోడం గంగులు, గుండె గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలో సబ్ కలెక్టర్ తనిఖీలు

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలను సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థుల నుంచి ఆహారం నాణ్యత, రుచి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సృజనాత్మకత వెలికితీసేలా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్, లెక్కలకు సంబంధించిన 54 స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి, వివిధ పాఠశాలలకు చెందిన సైన్స్, లెక్కల ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, సత్రంపాడు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, చాంద్ రెసిడెన్సీ, ప్లాట్ నెం.101 కాపురస్తులు బూరుగుపల్లి అనంతలక్ష్మి, W/o. సత్యనారాయణ (లేటు) అను నేను తెలియ జేయునది ఏమనగా, ది.15-12-2025వ తేదీన Doc.No.1590/1988రు గా రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజును మా ఇంటి వద్ద నుండి ఏలూరులో బ్యాంక్ పని నిమిత్తం దస్తావేజులు తీసుకొని వెళ్ళుచుండగా దారి మధ్యలో ఎక్కడో పడిపోయినవి. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైన దొరికినచో అడ్రస్సుకి తెలియజేయగలరు.

బూరుగుపల్లి అనంతలక్ష్మి, W/o.సత్యనారాయణ(లేటు), సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, చాంద్ రెసిడెన్సీ, ప్లాట్ నెం.101, సత్రంపాడు, ఏలూరు జిల్లా.

ప్రకటన

మహారాజశ్రీ II అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

I.A.No.33/2025 in O.S.No.114/2025

పిటీషనర్/వాది: జోగి రాంబాబు, S/o.రామకృష్ణ, డో.నెం.4-140, కట్టా వారి పాలెం, యనమదుర్రు పోస్టు, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

రెస్పాండెంటు/ప్రతివాది : మట్టపర్తి వరశేష తరుణ లక్ష్మి, W/o.ప్రకాష్, డో.నెం.1-305, అదిత్య కాలేజి ఎదురుగా, 2వ వీధి, కొమరాడ రోడ్డు, రాయలం, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు పిటీషనులో అందు మీకు కోర్టు నుండి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీకు అందని దరిమిలా శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా నోటీసు వేసియున్నారు. పై నెంబరు పిటీషను ది.05-01-2026 తేది వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఉదయం 10.30 గంటలకు శ్రీకోర్టు వారి ముందు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ వాదనను వినిపించవలసినది. లేని యెడల మీ పరోక్షమునందు మీకు వ్యతిరేకముగా విచారణ జరుగును.

వాయిదా తేది : 05-01-2026

జి.వి.స్టీఫెన్‌బాబు, వై.యోహాను
అద్వకేట్స్, భీమవరం, ప.గో.జిల్లా.
సెల్: 8790950666

గురుకుల పాఠశాల భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం(బాలికలు) పాఠశాలలో శిథిలమైన భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి మంజూరైన నిధులతో త్వరితగతిన పనులు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తేవాలని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఇటీవల కాలంలో పాఠశాలలో ప్రయోగశాల నిర్వహిస్తున్న నాలుగు గదుల భవనం కుప్పకూలింది. ఈ విషయాన్ని సర్పంచి రహీమా బేగం హసేన ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన స్పందించిన ఎంఎల్‌ఎ సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌ను సంప్రదించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నూతన భవనాల నిర్మాణానికి గనులశాఖకు చెందిన రూ.కోటి మంజూరు చేశారని, నిర్మాణ బాధ్యతలను ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించారని తెలిపారు. ఇదే క్రమంలో నూతన భవనాల నిర్మాణానికి అనువైన స్థల పరిశీలన చేసేందుకు ఎంఎల్‌ఎ పాఠశాలను గురువారం సందర్శించారు. ఇంజినీరింగ్ విభాగం, పాఠశాల యాజమాన్యం, గ్రామ సర్పంచితో చర్చలు జరిపారు. భవన నిర్మాణానికి స్థలం ఎంపిక కార్యక్రమాన్ని పూర్తి చేశారు. భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలను జారీ చేశారు. ఇదే పాఠశాలలో డార్మెట్రీ మరమ్మతులకు మంజూరైన రూ.50 లక్షలతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కరణం పెద్దిరాజు, పత్తి మదన్, యుగంధర్, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ పద్మావతి దేవి, పాల్గొన్నారు. తొలుత పాఠశాల ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు.

ప్రకటన

మహారాజశ్రీ II అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

O.S.No.114/2025

వాది: జోగి రాంబాబు, S/o.రామకృష్ణ, డో.నెం.4-140, కట్టా వారి పాలెం, యనమదుర్రు పోస్టు, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

ప్రతివాది : మట్టపర్తి వరశేష తరుణ లక్ష్మి, W/o.ప్రకాష్, డో.నెం.1-305, అదిత్య కాలేజి ఎదురుగా, 2వ వీధి, కొమరాడ రోడ్డు, రాయలం, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో అందు మీకు కోర్టు నుండి ఎన్నిపర్యాయములు సమన్లు పంపిననూ మీకు అందని దరిమిలా శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా నోటీసు వేసియున్నారు. పై నెంబరు దావా ది.05-01-2026 తేది వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఉదయం 10.30 గంటలకు శ్రీకోర్టు వారి ముందు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ వాదనను వినిపించవలసినది. లేని యెడల మీ పరోక్షమునందు మీకు వ్యతిరేకముగా విచారణ జరుగును.

వాయిదా తేది : 05-01-2026

జి.వి.స్టీఫెన్‌బాబు, వై.యోహాను
అద్వకేట్స్, భీమవరం, ప.గో.జిల్లా.
సెల్: 8790950666

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు

ఓ.యస్.నెం.365/2025

బిట్వీన్:-
శ్రీమతి. మానేపల్లి సత్య సుధా బింధు ...పిటీషనర్/వాది
మరియు
శ్రీ కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ నాగరాజు యలియాస్ మురళీ రాజ్ ...రెస్పాండెంట్

పిటీషనరు/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో రెస్పాండెంటు అయిన శ్రీ. కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ రాజ్, తండ్రి: రామచంద్రరావు, డోర్.నెం. 4-20-30, అగ్రహారం, ఏలూరు-1, ఏలూరు జిల్లా అను వారికి **ది. 05-01-2026వ తేది ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ అక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావాను తమ పరోక్షమందు విచారించి తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

గెళ్ళ శ్రీనివాసరావు
గెళ్ళ సాయి అనూష
ఏలూరు — అడ్వకేట్స్, ఉప్పు వారి వీధి,
ది.17-12-2025 — ఎన్.ఆర్.పేట్, ఏలూరు

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

ఉంగుటూరు : గ్రామాల్లో ఇళ్ల నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్త కింద వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని, తద్వారా వీధులను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని ఎంపిడిఒ తెలిపారు. ఉంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొన్ని వీధుల్లో ఆయన గురువారం పర్యటించి ఆ ప్రాంతంలోని మహిళలకు పొడి, తడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం పలు వీధుల్లో పర్యటించి డ్రెయినేజీ సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లా డిపిఆర్‌సి మేనేజర్ ప్రసంగిరాజు, సూర్య కుమార్, ఉంగుటూరు పంచాయతీ కార్యదర్శి బొడ్డు రవిచంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు జెడ్‌పి చైర్‌పర్సన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) నియమితులవ్వడం పట్ల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బడేటి చంటిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో, ప్రజాసేవలో అనుభవం కలిగిన నాయకుడైన బడేటి చంటి నాయకత్వంలో జిల్లాలో టిడిపి మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కృషి మరింత విస్తృతంగా కొనసాగాలని కోరుకుంటూ, ఈ నియామకం పార్టీకి, జిల్లాకు శుభప్రదమని తెలిపారు.

నేడు నిరసన : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా ఈ నెల 19న పవర్ పేట సుందరయ్య గ్రంథాలయం వద్ద గాంధీజీ విగ్రహం ఉన్న ప్రదేశంలో సిపిఎం నిరసన కార్యక్రమం జరుగుతుందని ఆ పార్టీ నగర కార్యదర్శి పంపన రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టబద్ద హక్కుగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ఉపాధి హామీ చట్టానికి ఇప్పటివరకు 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 10 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించేవని, కేంద్ర ప్రభుత్వం సవరణలో భాగంగా 60 శాతం కేంద్ర ప్రభుత్వం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా నిర్ణయించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు ఖండించకపోవడం విడ్డురంగా ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు కెరియర్ గైడెన్స్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని మద్దాయికుంట గ్రామంలో ఉన్న జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు గురువారం కెరియర్ గైడెన్స్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ పాఠ్యాంశాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకుంటే జీవితంలో ఎన్నో జఠిలమైన సమస్యలకు సులువైన మార్గాలను స్వయంగా అన్వేషించుకునే శక్తి సామర్థ్యాలు విద్యార్థి దశలో ఏర్పడతాయన్నారు. క్రీడలు, ఇష్టమైన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యాభ్యాసంలో ఉండే ఒత్తిడికి దూరం కావచ్చున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని నేటి విద్యార్థులు రేపటి బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - ముసునూరు

పదో తరగతి అర్హతతో ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఓగిరాల రామలింగేశ్వరరావు, సెంట్రల్ విద్యాకమిటీ ఛైర్మన్ అనంతలక్ష్మి తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు సాధించిన విద్యార్థులకు పాఠశాల తరపున బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని రావిచెర్ల, బోర్వంచ గ్రామాల్లో, నూజివీడు మండలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా సదస్సు, క్షేత్ర సందర్శన చేశారు. ఈ సదస్సుకు నూజివీడు మామిడి పరిశోధన స్థానం నుంచి ప్రధాన శాస్త్రవేత డాక్టర్ బి.కనకమహాలక్ష్మి మాట్లాడుతూ మామిడి తోటల్లో పూతలు ప్రారంభమవుతున్నాయని, తోటలు కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అలాగే పోటాష్ ఐదు గ్రాములు, జింక్, బోరాన్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి, నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి తోటలకు పిచికారీ చేయాలని సూచించారు. తోటల్లో చెట్లకు ఎండుకొమ్మలు లేకుండా తీసివేయాలన్నారు. పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ అధికారి హేమ మాట్లాడుతూ మామిడి కవర్లకు రాయితీ ఉందన్నారు.

అంగన్వాడీ సమావేశాన్ని మత రాజకీయం చేయొద్దు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

అంగన్వాడీ సమావేశాన్ని ఒక మతానికి అంటగడుతూ రాజకీయం చేయొద్దని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరుతూ బుధవారం కుక్కునూరు చర్చిలో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశాన్ని మతం పేరుతో రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రధానంగా కుక్కునూరుకు కొత్తగా ప్రాజెక్టు ఏర్పడిందని, కాని ప్రభుత్వం కార్యాలయం నిర్మించలేదని, ప్రస్తుతం సచివాలయంలో ఒక గదిలో కార్యాలయం ఏర్పాటు చేశారని, ప్రాజెక్టు మొత్తం 160 మంది అంగన్వాడీలకు సమావేశం ఏర్పాటు చేసే స్థలం లేదని, అదేవిధంగా బహిరంగ మరుగుదొడ్లు కూడ లేవని, మహిళలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని అంత మందికి ఒకే సారి సమావేశం పెట్టే స్థలం లేకపోవడంతో దగ్గరలో ఉన్న చర్చిలో అందరి అభిప్రాయం మేరకు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మత బోధనలు, మత ప్రచారాలు ఏమి చేయలేదని, కేవలం మహిళలు ఇబ్బందులు రీత్యా సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సమావేశాన్ని మత రాజకీయం చేయడం సరికాదని పేర్కొన్నారు.

సమృద్ధిగా ఎరువుల నిల్వలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ భాషా సూచించారు. గురువారం పోలవరం మండలంలోని నాలుగు సహకార సొసైటీల సెక్రటరీలతో ఎరువుల సరఫరా, నిల్వలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువులను బస్తరేటు కంటే అధిక ధరలకు విక్రయించినట్లయితే సంబంధిత షాపులు, డీలర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అవసరానికి మించి ఎరువులు వినియోగించకూడదని, నిల్వ వేసుకునే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కోట రామచంద్రపురం పిజి బుజ్జిబాబు, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, సొసైటీ సెక్రటరీలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి అడ్డదిడ్డంగా ఏర్పడిన రోడ్డు ఆక్రమణల వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రెండో రోజు కూడా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో కొనసాగించారు. జంగారెడ్డిగూడెం పోలీస్ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ శాఖల సహకారంతో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న అక్రమ కట్టడాలు, బోర్డులు, తాత్కాలిక షెడ్లు, తోపుడు బండ్లను తొలగించారు. భవిష్యత్తులో రోడ్లపై అవరోధాలు కలిగించవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

భారత ప్రభుత్వం
भारतसरकार
पर्यावरण, वनएवंजलवायुपरिवर्तनमंत्रालय
పర్యావరణం, అడవులు మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ
ప్రాంతీయ కార్యాలయం, చెన్నై (ఉపకార్యాలయం - విజయవాడ)
గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, విజయవాడ - 520010, ఆంధ్రప్రదేశ్
ఈ-మెయిల్: iro.vijayawada-mefcc@gov.in, ప్రాంతీయ కార్యాలయం, చెన్నై

ఆన్‌లైన్ ప్రతిపాదన సంఖ్య: FP/AP/OFC/446675/2023 — **తేదీ: 27/11/2025**

To,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యావరణం, అడవులు, సైన్స్ & టెక్నాలజీ విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గది నెం.268, 1వ అంతస్తు, 4వ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, వెలగపూడి, అమరావతి గుంటూరు జిల్లా-522503

విషయం: ఏలూరు అటవీ డివిజన్‌లోని "కొయ్యలగూడెం - కన్నాపురం-గోగుమిల్లి-ఉర్రింక-రావిగూడెం" మార్గం మధ్య రోడ్ల వెంట భూగర్భ OFC వేయడానికి 1.25 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడానికి ప్రతిపాదన మెస్సర్స్ భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ (గతంలో టెలిసోనిక్ నెట్‌వర్క్స్ లిమిటెడ్), హైదరాబాద్‌కు అనుకూలంగా.

సర్/మేడమ్: పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, 1980 సెక్షన్ 2(1) కింద కేంద్ర ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి కోరుతూ పరివేష్ 2.0 ద్వారా అందిన రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆన్‌లైన్ ప్రతిపాదన నెం.FP/AP/OFC/446675/2023, తేదీ 27.11.2025 మరియు పర్యావరణం, అటవీప్రాంతాలు, శాస్త్రాలు & సాంకేతిక (సెక్షన్ - II) శాఖ G.O.Ms.No.73 తేదీ 08.12.2025 లను సూచించమని నన్ను ఆదేశించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, 1.25 హెక్టార్ల మళ్లింపు కోసం వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, 1980 సెక్షన్ '2 (1)' కింద కేంద్ర ప్రభుత్వం యొక్క సూత్రప్రాయ ఆమోదం (స్టేజ్-2) ను తెలియజేయమని నన్ను ఆదేశించడం జరిగింది. ఏలూరు ఫారెస్ట్ డివిజన్‌లోని "కొయ్యలగూడెం - కన్నాపురం-గోగుమిల్లి-ఉర్రింక-రావిగూడెం" మార్గం మధ్య రోడ్ల వెంట భూగర్భ OFC వేయడానికి అటవీ భూమిని మెస్సర్స్ భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్ (గతంలో టెలిసోనిక్ నెట్‌వర్క్స్ లిమిటెడ్), హైదరాబాద్‌కు ఈ క్రింది షరతులకు లోబడి:-

1. సాధారణ షరతులు

వ. నెం	స్టేజ్-2 షరతులు
1.1	అటవీ భూమి యొక్క చట్టపరమైన స్థితి మారదు.
1.2	అటవీ భూమిలో కార్మిక శిబిరాలను ఏర్పాటు చేయకూడదు.
1.3	సమీపంలోని అటవీ ప్రాంతాలపై ఎటువంటి నష్టం మరియు ఒత్తిడిని నివారించడానికి యూజర్ ఏజెన్సీ సైట్‌లో పనిచేసే కార్మికులు మరియు సిబ్బందికి ప్రాధాన్యంగా ప్రత్యామ్నాయ ఇంధనాలను అందించాలి.
1.4	ప్రతిపాదనలో పేర్కొన్న దానికంటే ఇతర ప్రయోజనాల కోసం అటవీ భూమిని ఉపయోగించకూడదు.
1.5	కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ప్రతిపాదన యొక్క లేఅవుట్ ప్లాన్‌ను మార్చకూడదు.
1.6	మళ్లించాలని ప్రతిపాదించబడిన అటవీ భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా మరే ఇతర ఏజెన్సీ, విభాగం లేదా వ్యక్తికి బదిలీ చేయకూడదు.
1.7	పరిసర ప్రాంతంలోని వృక్షజాలం మరియు జంతుజాలానికి ఎటువంటి నష్టం కలిగించకూడదు.
1.8	ఈ ఆమోదం కింద మళ్లింపు వ్యవధి, వినియోగదారు ఏజెన్సీ లేదా ప్రాజెక్ట్ జీవితకాలం తరపున మంజూరు చేయబడే లీజు వ్యవధితో సహ-ముగింపు అవుతుంది, ఏది తక్కువైతే అది.
1.9	నిర్మాణ పనుల రవాణా కోసం అటవీ ప్రాంతం లోపల అదనపు లేదా కొత్త మార్గాలు నిర్మించబడవు ప్రాజెక్ట్ పని అమలుకు అవసరమైన సామగ్రి
1.10	ప్రాజెక్టు కోసం ఉపయోగించిన మొత్తం అటవీ ప్రాంతం 1.25 హెక్టార్లకు మించకూడదు.
1.11	సంబంధిత డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, చుట్టుపక్కల ప్రాంతంలోని అడవిపై ఎటువంటి ప్రతికూల ప్రభావం లేదని నిర్ధారించడానికి అవసరమైన ఉపశమన చర్యలు తీసుకుంటారు మరియు పర్యవేక్షిస్తారు.
1.12	పైన పేర్కొన్న షరతులకు సంబంధించి వినియోగదారు ఏజెన్సీ ప్రతి సంవత్సరం మార్చి చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ప్రాంతీయ కార్యాలయానికి వార్షిక స్వీయ-సమ్మతి నివేదికను సమర్పించాలి.
1.13	ఈ ప్రాజెక్టుకు వర్తించే విధంగా ప్రస్తుతానికి అమలులో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని చట్టాలు, నియమాలు, నిబంధనలు మరియు మార్గదర్శకాలు, గౌరవనీయ న్యాయస్థాన ఆదేశాలు మరియు %చీ+ు% ఆదేశాలు (లు) యొక్క అన్ని నిబంధనలను వినియోగదారు ఏజెన్సీ పాటించాలి.
1.14	వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, 1980 కింద జారీ చేయబడిన నియమాలు / మార్గదర్శకాల ప్రకారం అటవీ హక్కుల చట్టం, 2006 ప్రకారం పాటించాల్సిన షరతులను ఖచ్చితంగా పాటించాలి.
1.15	అటవీ వన్యప్రాణుల పరిరక్షణ, రక్షణ మరియు అభివృద్ధి దృష్ట్యా పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు నిర్దేశించే ఏవైనా ఇతర షరతులు
1.16	ఈ షరతులలో దేనినైనా ఉల్లంఘిస్తే అది వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, 1980 ఉల్లంఘన అవుతుంది మరియు సంబంధిత చట్టం, నియమాలు మరియు మార్గదర్శకాల ప్రకారం సూచించిన విధంగా చర్య తీసుకోబడుతుంది.

2. ప్రామాణిక షరతులు

వ. నెం	స్టేజ్-2 షరతులు	ప్రత్యుత్తరం
2.1	N/A	

3. నిర్దిష్ట షరతులు

వ. నెం	స్టేజ్-2 షరతులు
3.1	రాష్ట్ర అటవీ శాఖ ఆమోదించిన పథకం ప్రకారం, ఏలూరు సెక్షన్‌లోని రామ సింగవరం ఫారెస్ట్ బ్లాక్‌లోని కాంప్ నంబర్ 200 & 201లో గుర్తించబడిన 2.50 హెక్టార్ల క్షీణించిన అటవీ భూమిపై పరిహార అటవీకరణ (%జూ%)ను పెంచాలి, దీని ఖర్చును యూజర్ ఏజెన్సీ నుండి సేకరించాలి.
3.2	WP నం.1164/2023 లోని తుది ఫలితం ఆధారంగా, వర్తిస్తే, మళ్లించబడిన అటవీ ప్రాంతానికి బదులుగా, వినియోగదారు ఏజెన్సీ NFL ప్రాంతంలో పరిహార అటవీకరణక" CA ని అందించాలి, ఇది ప్రస్తుతం గౌరవనీయులైన భారత సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర అటవీ శాఖ ఈ విషయంలో వినియోగదారు ఏజెన్సీ నుండి ఒక హామీని పొందేలా చూసుకోవాలి.
3.3	యూజర్ ఏజెన్సీ CA కొరకు రూ.68,06,634/- మరియు NPV (CA కొరకు రూ.9,82,000/-, NPV కొరకు రూ.19,94,738/- మరియు జరిమానా NPV గా రూ.38,29,896/-) చెల్లించింది. UA చెల్లించిన లెవీలను ఆమోదించబడిన ప్లాన్/స్కీమ్ ప్రకారం ఉపయోగించుకోవాలి.

పైన పేర్కొన్న షరతుల నెరవేర్పుపై సమ్మతి నివేదిక అందిన తర్వాత, ప్రతిపాదనను అటవీ (సంరక్షణ) చట్టం, 1980లోని సెక్షన్ 2 కింద తుది ఆమోదం కోసం పరిగణిస్తారు. ఈ విషయంలో ప్రభుత్వం తుది ఆమోదం ఇచ్చే వరకు అటవీ భూమి బదిలీ అమలు చేయబడదు.

ఇంకా, ఈ సూత్రప్రాయ ఆమోదం ఈ లేఖ జారీ చేసిన తేదీ నుండి 2 సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుందని కూడా గమనించవచ్చు. పైన పేర్కొన్న షరతులను 2 సంవత్సరాలలోపు పాటించని సందర్భంలో, సూత్రప్రాయ ఆమోదం చెల్లదు.

మీ నిబద్ధతతో
(బాలాజీ కరి)
అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్(కేంద్రం)